సాక్షి చిత్తూరు

శుక్రవారం । 5 । జూలై । 2024



ఎర్రచందనం స్వాధీనం

పుత్తూరు రేంజ్ పరిధిలో రూ.5లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



స్వయం ఉపాధితోనే..

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన మహిళలు గురువారం సర్టిఫికెట్లు అందుకున్నారు. - 8లో



బేకరీలో తనిఖీలు

చిత్తూరు నగరంలోని బేకరీలో తనిఖీలు చేసిన అధికారులు ఫుడ్ లైసెన్స్ తీసుకోలేదని గుర్తించి నోటీసులు జారీ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

అల్లూరి బాట ఆదర్శం



అల్లూరికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం: సమ సమాజ స్థాపనకు అల్లూరి సీతా రామరాజు చూపిన బాటే అందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య మహా సంగ్రామంలో మహోజ్వల శక్తిగా అల్లూరి వెలుగొందారని స్మరించారు. బ్రిటీషర్ల పాలనలో గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అఘాయిత్యాలు, దోపిడి, దౌర్జన్యాలు చూసి తట్టుకోలేక తిరుగుబాటు జెండా ఎగురవేశారన్నారు. ఈ పోరాటంలో 27 ఏళ్ల వయసులోనే అమరవీరులై తెలుగు జాతి గుండెల్లో చిరస్మరణీయులయ్యారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీనివాసులు, డ్వామా పీడీ రాజశేఖర్ డీఆర్‌డీఏ పీడీ తులసి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానంపై కఠిన చర్యలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ, అధికారులు

చిత్తూరు అర్బన్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై, విద్యాసంస్థలకు వంద మీటర్ల పరి ధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు శాఖ అధికారులందరూ పొగాకు వాడకానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మత్తు వల్ల కలిగే అనర్థాలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేలా చూడాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. డీఎంహెచ్‌ఓ ప్రభావతి, అడిషనల్ ఎస్పీ అరీపుల్లా, శ్రావణ్‌కుమార్, సంబంద్ హెల్త్ ఫౌండేషన్ మేనేజర్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల పరిశీలన



గుడివంక ఆలయాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నలక్ష్మి

గుడుపల్లె: ఆలయాలను అభివృద్ధి చేసేందుకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, ఇంజినీర్లు, వాస్తుశాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని గుడివంక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, మల్లప్పకొండ మల్లేశ్వరస్వామి ఆలయం, యామగానిపల్లె శ్రీ ద్రౌపది ధర్మరాజుల ఆలయాలను వారు గురువారం పరిశీలించారు. ఆలయాలకు కావలసిన సౌకర్యాలు నూతన భవనాలు గోపురాలు, కోనేరులు, గర్భగుడులు వంటి వసతులు కల్పించేందుకు పర్యవేక్షించారు. ప్రతి ఆలయం భక్తులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేసేందుకు సదుపాయాలు కల్పించేందుకు కావలసిన సౌకర్యాలను అంచనా వేసేందుకు ఇంజినీర్లు ఆలయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇంజనీర్లు, ఈవో చలపతి, తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో అనిల్ రావిపూడి



స్వామిని దర్శించుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. భక్తులు ఆయనతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్ తదితరులున్నారు.

కౌండిన్యలో ప్లాంటేషన్

కౌండిన్య అభయారణ్యంలో మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. కలపచెట్లతోపాటు ఫల వృక్షాలను పెంచేందుకు నిర్ణయించింది. తద్వారా పచ్చదనాన్ని పెంచడంతోపాటు వన్యప్రాణులకు ఆహార కొరత రాకుండా చూసేందుకు ప్రయత్నిస్తోంది. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఈ వర్షాకాలంలో లక్షన్నర మొక్కలు అడవిలో నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. అటవీప్రాంతంలో మొక్కలు నాటే పనులు ఇప్పటికే ప్రారంభించింది.

- 1.5 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ఈ నెల నుంచి ఆగస్టులోపు పూర్తి
- వర్షాకాలంలో ముమ్మరంగా మొక్కల పెంపకం



సాక్షి, చిత్తూరు: దట్టమైన కౌండిన్య అటవీ ప్రాంతంలో ముమ్మరంగా మొక్కలు నాటేందుకు జిల్లా అటవీశాఖ శ్రీకారం చుట్టింది. అందుకోసం అవసరమైన మొక్కలు నర్సరీల్లో ఇప్పటికే పెంచుతోంది. అన్ని కాలాల్లోనూ పచ్చదనం నిండేలా పర్యావరణ సమతుల్యత కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వర్షాకాల సీజన్‌లో సుమారు 1.5 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ నెల నుంచి ఆగస్టులోపు మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలని సంకల్పించింది. అందుకోసం ఇప్పటికే చర్యలు మొదలెట్టేసింది.

ఈ సీజన్‌లోనే మొక్కల పెంపకం

జిల్లాలోని కౌండిన్యలోని సుమారు 173.3 హెక్టార్ల అటవీ ప్రాంతంలో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకున్నారు. ఇందులో ఇప్పటికే సుమారు 133.3 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని మొక్కలు పెంచేందుకు వీలుగా తీర్చారు. అందులో హెక్టారుకు 1,100 చొప్పున మొత్తం 1,46,300 మొక్కలు నాటనున్నారు. ఇక తటస్థమైన భూ ప్రాంతాల్లో కూడా మొక్కలు పెంచే చర్యలు చేపట్టనున్నారు. ఇలాంటి ప్రాంతాల్లోని సుమారు 40 హెక్టార్లలో హెక్టారుకు 200 మొక్కలు చొప్పున 8 వేల మొక్కలు నాటనున్నారు.

నీటి సరఫరా ఏర్పాట్లు

సాధారణంగా వర్షాకాలంలో సహజంగానే మొక్కలకు వర్షపు నీరు లభిస్తుంది. ఇవి కాకుండానే ట్యాంకర్ల ద్వారా 145 పీటీ ట్యాంకులు, 85 సాసర్‌పిట్లు, 71 చెక్‌డ్యాంలకు నీరు నింపే చర్యలు చేపట్టారు. వీటి సాయంతో ఆయా ప్రాంతాల్లో మొక్కల సంరక్షణకు నీటి సరఫరా చేయనున్నారు.

అడవుల రక్షణకు ప్రాధాన్యం

కౌండిన్యలో పచ్చదనం పెంపుతోపాటు అటవీ రక్షణ చర్యలు కూడా అధికారులు చేపట్టారు. మొత్తం 16 బీట్స్‌లో 75 మంది ప్రొటెక్షన్ వాచర్స్ పనిచేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో 30 కందకాలు ఏర్పాటు చేస్తున్నారు. 30 మీటర్ల విస్తీర్ణంతో కొలనులు నిర్మిస్తున్నారు. సోలార్ బోర్‌వెల్స్ పనులు కూడా చేపట్టారు. అటవీ ప్రాంతాల నుంచి జంతువులు బయటకు వెళ్లకుండా కాపాడుతున్నారు. ఒక వేళ జంతువులు బయటకు వెళితే వాటిని తిరిగి అటవీ ప్రాంతాలకు మళ్లించేలా సిబ్బంది పనిచేస్తున్నారు. అంతేకాకుండా అటవీ ప్రాంతంలోని కలప, వృక్ష సంపద తరలిపోకుండా స్మగ్లింగ్ నివారణకు కృషిచేస్తున్నారు. అడవులకు నిప్పు పెట్టకుండా సమీప ప్రాంతాల్లోని గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారు.

కౌండిన్యలో వృక్ష, జంతు, సంపద అపారం

కౌండిన్యలోని చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు రేంజ్‌ను కలిపి రాయల్ ఎలిఫెంట్ రేంజ్‌గా పిలుస్తారు. కుప్పం రేంజ్ నుంచి పలమనేరు రేంజ్ వరకు కౌండిన్య వైల్డ్ లైఫ్ అభయారణ్యంగా పరిగణిస్తారు. కౌండిన్య అటవీ ప్రాంతంలో ప్రధానంగా జిల్లేడు, అడివితట, సిగర, ముష్టిచెట్టు, అల్ల నేరేడు, మర్రి, నేరేడు, శీకాయ, మర్రి, వెదురు, చింత వంటి ప్రధాన రకాలతోపాటు ఇతర వృక్ష సంపద ఉంది. ఇక జంతువులు నివాసంగా పరిగణించే మొత్తం 41.5 కిలోమీటర్ల దూరంలోని దట్టమైన అటవీప్రాంతంలో ఎకో సెన్సిటివ్ జోన్‌గా ఇప్పటికే అటవీశాఖ ప్రకటించింది. ఇక 7.1 కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో అన్ని రకాల జంతువులు సంచరించే ప్రాంతంగా ప్రకటించారు. ఈ మార్గంలో 3.5 కిలోమీటర్ల దూరంలో మధ్యలోనే వన్యప్రాణులు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు ప్రమాదాల్లో జంతు మరణాలు లేకుండా ఉండేలా హైవే రోడ్డు కింది భాగంలో 5 అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. అటవీ మార్గాలు, లోయ ప్రాంతాల్లో 4 నుంచి 50 మీటర్ల ఎత్తు, 150 అడుగుల వెడల్పుతో బ్రిడ్జిల నిర్మాణం సాగుతోంది.

10 నర్సరీల్లో మొక్కలు సిద్ధం

చిత్తూరు జిల్లాలో అటవీ ప్రాంతాల్లో దాదాపు 1.50 లక్షల మొక్కలకుపైగా నాటాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో భారీ వృక్షాలుగా పెరిగే రావి, జువ్వి, వేప, చింత, ఎర్రచందనం, అల్లనేరేడు, మద్ది మొక్కలను నాటాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ఇప్పటికే జిల్లాలోని 10 నర్సరీల్లో ఈ మొక్కలు సిద్ధం చేశారు. గత ఏడాది నవంబరు నుంచి మే వరకు మొక్కలు పెంచారు. వీటిని ఈ నెల నుంచి ఆగస్టు వరకు అడవి ప్రాంతాల్లో నాటనున్నారు.



అడవిలో నాటేందుకు నర్సరీల్లో సిద్ధం చేసిన మొక్కలు



నర్సరీలో మొక్కలను పరిరక్షిస్తున్న సిబ్బంది

పచ్చదనం ఉంటేనే పర్యావరణ సమతుల్యత



వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇస్తాం. ఇందుకోసం ఇప్పటికే నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. నాటిన తర్వాత వాటిని క్రమంగా పెంచే చర్యలు కొనసాగిస్తాం. మొక్కలకు అడ్డుగా ఉండే కలుపు ఎప్పటికప్పుడు తొలగిస్తాం. నీటి వసతికి అధిక ప్రాధాన్యత ఇస్తాం. ప్రత్యేకించి ఏనుగులకు ఆహారంగా గడ్డిని పెంచుతాం. అడవి పచ్చదనంతో నిండి ఉంటేనే పర్యావరణం సమతుల్యత ఉంటుంది. అడవుల రక్షణకు ప్రొటెక్షన్ వాచర్లు అనుక్షణం కాపలా కాస్తున్నారు.

- చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌వో

నీట్‌ను రద్దు చేయాల్సిందే

- జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం నీట్‌ను ఖచ్చితంగా రద్దు చేయాల్సిందేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఆ సంఘం జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీల నిర్లక్ష్యానికి కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ చిత్తూరులో విజయవంతంగా ముగిసిందన్నారు. వైద్య విద్యతో వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పేద మధ్య బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యను దూరం చేసే పద్ధతుల్లో పేపర్ లీకేజీలు చేస్తున్న నీట్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో కేంద్రం విఫలమైందన్నారు. నీట్ లీకేజీ తెరవెనుక కుంభకోణం, నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లింపు, నీట్‌ను రద్దు చేయాలని కేంద్రం పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ నిర్వహించే విధులు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేష్,రోహిత్ విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాల నుంచి విద్యార్థులను బయటకు పంపుతున్న ఏఐఎస్ఎఫ్ సంఘ నాయకులు

రెవెన్యూ సమస్యలపై వినతుల వెల్లువ



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికంగా రెవెన్యూ సమస్యలపైనే వినతులు వచ్చాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీగా తరలి వచ్చిన జనం నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 600 వరకు వినతులు రాగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 436 ఉన్నాయి. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ ఫిర్యాదులపై తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి విచారించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, స్థానిక నాయకులు డాక్టర్ సురేష్, పీఎస్ మునిరత్నం పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పరిశీలన

పట్టణంలోని వడ్డిపల్లి వద్ద ఉన్న ఎన్టీఆర్ ఇండోర్, ఔట్ డోర్ స్టేడియాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ కలసి పరిశీలించారు. క్రీడాకారులు ఆడుకునేందుకు వీలుగా మైదానాన్ని సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కుప్పం మున్సిపాలిటీలో పాలనాపరంగా అధికారులు ఆటంకాలు కల్పిస్తున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్‌కు మున్సిపల్ చైర్మన్ సుధీర్ ఫిర్యాదు చేశారు. ప్రతి నెలా నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశం మూడు నెలలుగా జరపలేదని పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశం జరపకపోవడం వల్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి..

- ప్రస్తుతం టమాట బాక్సు ధర రూ.370
- రెండువారాల ముందు బాక్సు రూ.1000
- ఉత్తరాది రాష్ట్రాల్లో అన్‌లోడింగ్ కాని లారీలు

పలమనేరు: పలమనేరు హార్టికల్చర్ డివిజన్ పరిధిలో రెండు వారాలకు ముందు టమాట బాక్సు ధర వెయ్యి దాటింది. టమాటాలు కోస్తున్న రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రస్తుతం తోటలకు తెగుళ్ల కారణంగా పంట దిగుబడులు తగ్గినా మంచి ధరలుండడంతో రైతులు ఆశలు పెంచుకున్నారు. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఇక్కడి నుంచి వెళ్లిన టమాట లారీలు ఆయా రాష్ట్రాల్లో అన్‌లోడ్ కావడం లేదని టమాట వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ఇక్కడి నుంచి సరుకు బయటి రాష్ట్రాలకు రవాణా కావడం లేదు. ఫలితంగా ధరలు ఊరించి ఉసూరుమనిపించాయి. ప్రస్తుతం పలమనేరు మార్కెట్‌లో 14కిలోల బాక్సు ధర గరిష్టంగా రూ.370 కనిష్టంగా రూ.300 పలుకుతోంది.

వారం రోజుల్లో తగ్గుముఖం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, వీకోట, సోమల, సదుంలలో పెద్ద టమాట మార్కెట్లున్నాయి. గత నెల ఆఖరివారంలో బాక్సు ధర రూ.1000 పలికింది. అయితే ఈ వారం రోజుల్లో రూ. 370 కిందకు పడిపోయింది. పొరుగునే ఉన్న కర్ణాటకలోని వడ్డిపల్లి మార్కెట్‌లో మాత్రం గురువారం 16 కిలోల బాక్సు గరిష్టంగా రూ.500 పలికింది.

వర్షాలు తగ్గితేనే ధరలు

సాధారణంగా ఈ ప్రాంతం నుంచి టమాటాలు తెలంగాణా, ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్, హర్యానా, కోల్‌కతాలతో పాటు బంగ్లాదేశ్‌కు రవాణా అవుతుంటాయి. అయితే ఆయా రాష్ట్రాల్లో వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక్కడి నుంచి సరుకుతో వెళుతున్న లారీలకు అన్‌లోడింగ్ సమస్య నెలకొంది. వాహనాల రాకపోకలు సాఫీగా సాగితే, అక్కడ వర్షం తగ్గుముఖం పడితేగానీ ఇక్కడ ధరలు పెరిగే అవకాశం ఉండదని వ్యాపారులు చెబుతున్నారు.



పలమనేరు మార్కెట్‌కు చేరిన టమాటాలు

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో..

సాగైన టమాట పంట	3 వేల హెక్టార్లు
ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు	2,500 హెక్టార్లు
ప్రస్తుతం మార్కెట్లకు చేరుతున్న సరుకు	వంద లోడ్లకు పైగా

రూ.400 తగ్గితే రైతుకు నష్టమే



టమాట పంటను ఎకరాలో సాగు చేయాలంటే ఇప్పుడున్న ధరల్లో ఎకరానికి రూ.2లక్షలు దాకా ఖర్చు అవుతోంది. ఎకరానికి సగటున 800 బాక్సులు కోస్తే ఇప్పుడున్న ధరల మేరకు రూ.3.20 లక్షలు ఉంటుంది. అదే బాక్సు ధర రూ.300 కంటే తగ్గితే రూ.2.40 లక్షలు దాకా వస్తుంది. దీంట్లో సరుకు రవాణా కోసం రూ.20 వేలు పోతే, పంట పెట్టుబడి రూ.2లక్షలు పోతే ఇక రైతుకు ఏం మిగులుతుంది.

- టీఎస్ బుజ్జి, టమాట రైతు, బైరెడ్డిపల్లి

ధరలను అంచనా వేయలేం



టమాటాల ధరలు నిలకడగా ఉంటాయా లేవా అని ముందుగా అంచనా వేయలేం. ఎందుకంటే వర్షాల కారణంగా ధరల్లో మార్పులు రావచ్చు. రకరకాల కారణాలు ధరలను ప్రభావితం చేస్తాయి. అయితే ఇప్పుడు ఇక్కడ పంట దిగుబడులు తక్కువగానే ఉన్నాయి. సాధారణంగా అయితే ఎక్కువగానే ధరలుండాలి. కానీ ఎగుమతులు లేక తాత్కాలిక ఇబ్బందులు వచ్చాయి.

- కోటేశ్వరరావు, ఉద్యాన సహాయసంచాలకులు, పలమనేరు

డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్‌లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి షెడ్యూల్ ప్రకారం అడ్మిషన్‌లు ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు


ఆటో ప్రమాదంలో గాయపడిన రెడ్డెప్ప

పుంగనూరు: పట్టణం నుంచి సిద్దారెడ్డిపల్లెకు ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటోకు అడ్డుగా దుప్పి రావడంతో గురువారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఆటో ఆరడిగుంట వద్దకు వెళ్లగానే రోడ్డుపై వేగంగా దుప్పి రావడంతో డ్రైవర్ బ్రేకులు వేశాడు. ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సిద్దారెడ్డిపల్లికి చెందిన రెడ్డెప్ప(75) తీవ్రంగా గాయపడ్డాడు. సుజాత, లక్ష్మమ్మ స్వల్పంగా గాయపడ్డారు. ఈ మేరకు గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వయం ఉపాధితోనే మహిళా అభ్యున్నతి


కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు


బైరాగిపట్టెడలోని అనంగా బ్యూటీ స్టూడియోలో మహిళలకు శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు

- ఘనంగా ముగిసిన బ్యూటీషియన్ శిక్షణ
- కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ

తిరుపతి కల్చరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి వారి జీవన ప్రమాణాలు పెంపొందించుకోవడానికి చక్కటి మార్గదర్శినిగా స్వయం ఉపాధి దోహదపడుతుందని సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు తెలిపారు. సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని అనంగా బ్యూటీ స్టూడియో అండ్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళలకు నెల రోజుల పాటు ఇచ్చిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణా తరగతులు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలనే ఆకాంక్షతో సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో అనేక స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు శిక్షణలో మెలకువలను నేర్చుకోవడంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. నేటి ఆధునిక సమాజంలో ప్రతి మహిళ స్వశక్తితో ఎదుగుతూ కుటుంబానికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ పాల్గొన్నారు.

మహిళల ఎదుగుదలకు దోహదం

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు స్వయం ఉపాధి చక్కటి దోహదం. మహిళా అభివృద్ధిని కాంక్షిస్తూ సాక్షి వారు అనేక స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ కల్పించడం శుభపరిణామం. ఇలాంటి ఉపాధి కోర్సులను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తూ తమ కుటుంబాలకు బాసటగా నిలవాలి.

– వై.శ్యామల, శిక్షకురాలు, మాస్టర్స్ ఇన్ కాస్మోటాలజిస్ట్

భవిష్యత్‌పై నమ్మకం ఇచ్చింది

డిగ్రీ వరకు చదువుకున్నా ఉద్యోగం లేని నాకు నేను అభివృద్ధి సాధిస్తూ స్వయం శక్తి బతకగలననే నమ్మకాన్ని సాక్షి మైత్రి మహిళ వారి బ్యూటీషియన్ శిక్షణ కలిగించింది. ఈ శిక్షణ చాలా బాగుంది. అర్థమయ్యేలా అన్ని విషయాలు నేర్పుతూ మాలో ఎదగాలనే ఆకాంక్షను రేకెత్తించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు మహిళల ఉన్నతికి తోడ్పడుతాయి.

– వి.శ్రావణి, అనంతపురం జిల్లా, తాడిపత్రి

సాక్షికి కృతజ్ఞతలు

సమాజంలో మహిళలు మహారాణులుగా ఎదగాలని, కుటుంబానికి బాసటగా నిలవాలని ఆకాంక్షిస్తూ సాక్షి వారు అందిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ ప్రతి మహిళకు ఎంతో దోహదపడుతుంది. ఇలాంటి శిక్షణా తరగతులు ప్రతి మహిళ జీవితంలో చక్కటి వెలుగును ఇస్తాయి. మరిన్ని స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలతో మహిళలకు సహకారం అందించాలి.

– జి.కీర్తన, అనంతపురం

మనోస్థైర్యాన్ని నింపింది

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో అందించిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణ నాలో మనోస్థైర్యాన్ని నింపింది. నా కాళ్లపై నేను నిలబడి బతకడంతో పాటు నా కుటుంబానికి తోడ్పాటు అందించగలనన్న నమ్మకం కలిగింది. సాక్షి వారు అందించిన స్ఫూర్తి, సహకారానికి ధన్యవాదాలు.

– వై.మధురిమ, పోస్టల్ కాలనీ, తిరుపతి

సాక్షి సహకారం మరువలేనిది

మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సాక్షి వారు అందిస్తున్న సహకారం మరువలేనిది. నేను తీసుకున్న బ్యూటీషియన్ కోర్సు శిక్షణతో స్వయం ఉపాధి సాధించి కుటుంబానికి అండగా నిలవగలనన్న నమ్మకం కలిగించింది. స్వయంశక్తితో బతుకుతూ మరింతమంది మహిళలకు స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఈ శిక్షణతో కలిగింది.

– బి.రేష్మ, చెన్నై

అల్లూరి సేవలు ఎనలేనివి


అల్లూరికి నివాళులర్పిస్తున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సేవలు ఎనలేనివని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి సంక్షేమ శాఖ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను అల్లూరి గడగడలాడించి అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. స్వాతంత్ర్య పోరాటం కోసం బ్రిటీష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఢీకొన్న విప్లవ వీరుడని కొనియాడారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా, భూగర్భజలాల శాఖ డీడీ గంగాధరరెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ పద్మనాభం, జిల్లా మత్స్యశాఖ డీడీ రవీంద్రరెడ్డి అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

భార్యపై కత్తితో దాడి

చిత్తూరు అర్బన్: భార్యపై అనుమానం పెంచుకుని, కత్తితో దాడి చేసిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వలసయ్య కథనం మేరకు, గంగనపల్లెకు చెందిన సెల్వరాసన్ ఇదే కాలనీకి చెందిన ఆరిఫా 13 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఓ పాప కూడా ఉంది. ఇంటి వద్ద గురువారం ఆరిఫాతో భర్త సెల్వ రాసన్ గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఇంట్లో ఉన్న కత్తితో భార్యపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడ్డ ఆరిఫాను స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.5 లక్షల ఎర్ర చందనం స్వాధీనం


పుత్తూరు: స్వాధీనం చేసుకున్న ఎర్ర చందనం దుంగలు, పట్టుబడిన వ్యక్తి

పుత్తూరు: అటవీశాఖ అధికారులు గురువారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో నిర్వహించిన దాడుల్లో రూ.5 లక్షలు విలువ చేసే 45 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పుత్తూరు ఫారెస్ట్ రేంజర్ డి.మాధవి కథనం మేరకు, అందిన రహస్య సమాచారం మేరకు కేవీబీపురం నుంచి పిచ్చాటూరు వరకు అటవీ సిబ్బంది గస్తీ నిర్వహించారు. మారప్పరెడ్డి కండ్రిగ గ్రామం వెనుకవైపు పంట పొలాల్లో బొలెరో వాహనంలోకి కొందరు వ్యక్తులు ఎర్ర చందనం దుంగలను లోడింగ్ చేస్తుండగా దాడి చేశారు. ఒకరు పట్టుబడగా మిగిలిన వారు పారిపోయారు. వాహనంతోపాటు 327.9 కిలోల బరువు కలిగిన 45 దుంగలను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలుగా అంచనా వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో ఎఫ్ఎస్ఓ చైతన్య, ఎఫ్బీఓలు సురేష్‌కుమార్, నీలకంఠవాసు, సీబీఈటీ సిబ్బంది గోపి, రఘు, మహేంద్ర, సింహాద్రి, ప్రవీణ్, కార్తిక్, బోగరాజు, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా దుంగలు స్వాధీనం

తిరుపతి మంగళం : అక్రమంగా తరలిస్తున్న వాహనంతో పాటు ఎర్రచందనాన్ని అటవీశాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. తిరుపతి రూరల్ గొల్లపల్లి సమీపంలోని మామిడితోట వద్ద అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్నట్లు అధికారులు రహస్య సమాచారం అందింది. వెంటనే అధికారుల బృందం బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించినట్లు డీఎఫ్ఓ ఎం.శివకుమార్ తెలిపారు. ఆ ప్రాంతంలో స్ట్రైకింగ్ ఫోర్స్ బీట్ ఆఫీసర్ ఎం.ప్రసాద్‌కుమార్, సిబ్బంది సాయికిరణ్, షణ్ముగం, మునస్వామి, వినీల్ కుమార్ తనిఖీలు చేస్తుండగా మహేంద్ర కంపెనీ కారులో అక్రమంగా తరలిస్తున్న 125 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్మగ్లర్లు వాహనాన్ని వదిలేసి పారిపోయారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బైండోవర్

శాంతిపురం: మండలంలోని కడపల్లి గ్రామ సచివాలయం వద్ద ఉన్న సీఎం చంద్రబాబు ఫ్లెక్సీపై గుర్తు తెలియని వ్యక్తులు పేడను వేసిన ఘటన రాజకీయ దుమారం రేపింది. బుధవారం రాత్రి జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యుడిగా వైఎస్సార్‌సీపీ శాంతిపురం మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణిని పోలీసులు అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసుకుని వదిలిపెట్టారు. దండపాణి, కడపల్లికి చెందిన వేణును పోలీసులు గురువారం ఉదయం రాళ్లబూదుగూరు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, అడ్వొకేట్ శ్రీకాంత్, రెస్కో మాజీ వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసులు, రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు చెంగప్ప, కృష్ణమూర్తి పార్టీ శ్రేణులతో పాటు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఎస్ఐ నరేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఉదయం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. సీఎం ఫ్లెక్సీపై పేడ వేసిన అంశంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి అశ్వతనారాయణ ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. బుధవారం రాత్రి కడపల్లిలో వేణు జన్మదిన వేడుకల కోసం గుమికూడిన వారే పేడ వేసినట్టు ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై బుల్లెట్ దండపాణి సహా మరికొందరిని బైండోవర్ చేసుకుని వదిలిపెట్టామని చెప్పారు. ఫిర్యాదును కోర్టుకు పంపి కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్ మృతి


మృతి చెందిన డ్రైవర్ రాఘవయ్య


డ్రైవర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

పుంగనూరు: పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ బి.రాఘవయ్య(57) బుధవారం మృతి చెందారు. డిపోకు చెందిన భీమవరం- మంగళంపేట చూసుకుని రాత్రి కల్లూరులో బస్సు హాల్ట్ చేయాల్సి ఉంది. కల్లూరుకు సమీపంలో రాత్రి 10 గంటల సమయంలో రాఘవయ్య బస్సును నడుపుతూ స్పృహ కోల్పోయి బస్సును ఆపివేశాడు. దీంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఆర్టీసీ రవాణా అధికారి జితేంద్రనాథ్‌రెడ్డి, డీఎం సుధాకరయ్య డ్రైవర్ స్వగ్రామమైన సోమల మండలం పొదలకుంట్లపల్లికి వెళ్లి డ్రైవర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, తాత్కాలికంగా రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. డీఎం మాట్లాడుతూ డ్రైవర్ మృతి బాధాకరమని, ప్రభుత్వ పరంగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఈ సంఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

బేకరీలో తనిఖీలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ కూతవేటులో ఉన్న బేకరీని తనిఖీ చేసి, ఫుడ్ లైసెన్స్ లేదనే విషయం గుర్తించారు. ఫిర్యాదు ఇచ్చిన వారం తర్వాత మొక్కుబడిగా పరిశీలనకు వెళ్లారు. వ్యాపారులు ఇచ్చే కానుకలకు లొంగిపోయి దాడులు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏదో పరిశీలనకు వచ్చారు కాబట్టి ఆహార పదార్థాల శాంపిల్స్ తీసుకున్నారు. స్థానిక రామ్‌నగర్‌కాలనీలోని బేకరిపై ఫిర్యాదు రావడంతో గురువారం రాత్రి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తనిఖీ చేశారు. నిర్వహణ, పరిశుభ్రత లోపం ఉన్నట్లు గుర్తించారు. పలు ఆహారపదార్థాలు శాంపిల్స్ తీసి, నోటీసులు అందజేశారు.

పశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని పశువులు, జీవాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన జూనోసిస్ డే సందర్భంగా పాడి రైతులకు జూనోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. అంతేగాక కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయనున్నట్లు తెలియజేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి పశువులకు, జీవాలకు ముద్దచర్మ వ్యాధి, నీలి నాలుక వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యగా టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. గొడ్డుమోతు పశువులు యదకు వచ్చేందుకు అవసరమైన వైద్యాన్ని ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం మండలానికి ఒక ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. పశువుల మేతకు జొన్న, మొక్కజొన్న విత్తనాలను రైతులకు 75 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. అందులో జొన్న మొత్తం ధర కిలోకు రూ.71.50 నిర్ణయించగా, రాయితీ పోగా రైతుకు కిలో రూ.18 చొప్పున, మొక్క జొన్న కిలో మొత్తం ధర రూ.68 నిర్ణయించగా రాయితీ పోగా రూ.17 చొప్పున రైతులకు అందిస్తున్నామన్నారు. ఇందుకుగాను జిల్లాకు 252 టన్నుల విత్తనాలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ప్రతి రైతుకు గరిష్టంగా 20 కేజీల వరకు అందిస్తామన్నారు. ఇందుకుగాను రైతులు తమ సమీపంలోని పశువైద్య కేంద్రంలో సంప్రదించాలన్నారు.

మహిళ మెడలో నగల చోరీ

దొరవారిసత్రం: జాతీయ రహదారి పక్కనే దుకాణంలో వ్యాపారం చేస్తున్న మహిళ మెడలోని బంగారు నగలను ఇద్దరు దుండగులు లాక్కుని పరారైన ఘటన వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు, టపాయిండ్లు గ్రామానికి చెందిన అంబిక జాతీయ రహదారి పక్కనే టీ, కూల్‌డ్రింక్స్ షాపు నడుపుతోంది. ఈ క్రమంలో ఇద్దరు దుండగులు బైక్ వచ్చి తమిళంలో సిగరెట్ అడిగారు. అంతలోనే ఆమె మెడలోని 5 సవర్ల బంగారు చైన్‌ను లాక్కుని బైక్‌పై సూళ్లూరుపేట వైపుకు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: శ్రీకాళహస్తి మండలం వాగివేడుకు చెందిన గురవయ్య(37), మరో వ్యక్తితో ఏర్పేడు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. నచ్చనేరి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గురవయ్యతో పాటు వెనుక కూర్చున్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.